క్లుప్తంగా

వీఓఏల నిరసన



గద్వాల అర్బన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయం ఆవరణలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీఓఏలు ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే వీఓఏలకు కనీస వేతనాలు, ఆరోగ్యబీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో వీఓఏల మండల అధ్యక్షుడు తిమ్మప్ప, వెంకటేష్, జావిత్, శంకర్ ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



గద్వాల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్, డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు పరీక్ష రాశారు. జూనియర్ కళాశాలలలో ప్రవేశాల కోసం 2,547 మంది విద్యార్థులకు 2,339 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. డిగ్రీ కోర్సుల కోసం 408 మంది విద్యార్థులకు 343 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ ఎగ్జామినర్ శ్రీనివాస్, గురుకుల కళాశాలల జిల్లా కన్వీనర్ రాంబాబు పరిశీలించారు.

సెల్‌ఫోన్ల అందజేత



అయిజ: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో పోలీసులు 20 మందికి సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్‌కుమార్ మాట్లాడారు. సెల్ ఫోన్లను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, సైబర్‌నేరగాళ్లు కొత్త సాంకేతికతలను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ బృందం పాల్గొన్నారు.

13నుంచి క్రీడా పోటీలు



అయిజ: స్వేరోస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఓపెన్ క్రికెట్, జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని స్వేరోస్ చీఫ్ కన్వీనర్ దుర్గయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని బ్రైట్ స్టార్ హైస్కూల్లో టోర్నమెంట్ సన్నాహక సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వేరోస్ చీఫ్ కన్వీనర్ దుర్గయ్య మాట్లాడారు. మే 13, 14వ తేదీల్లో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి 20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే జట్లు మే 12వ తేదీ లోపు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి రథోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరబ్రహ్మేంద్రస్వాములవారి శిష్య బృందం ఆలపించిన భక్తిగీతాలను ఆకట్టుకున్నాయి. భజనలు, మేళతాళాలు, పటాకులు శబ్దాలమధ్య రథాన్ని భక్తులు లాగారు. గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వాములవారి నామస్మరణలు మార్మోగింది.

బైక్ చోరీ

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఔట్‌పోస్టు సమీపంలో బైక్ చోరీ అయ్యిందని తక్కశిల గ్రామానికి చెందిన నాగమద్దిలేటి 27న ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. అలంపూర్ చౌరస్తాలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వెళ్లి వచ్చే సమయానికి బైక్ కనబడలేదు. చుట్టు పక్కల వెతికిన దొరకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రారంభానికి ఎదురుచూపులు

- పదేళ్ల కిందట ఈజీఎస్ కార్యాలయ భవనం నిర్మాణం పూర్తి



ప్రారంభానికి నోచుకోని ఈజీఎస్ కార్యాలయ భవనం

అయిజ: మండల పరిషత్ కార్యాలయం పక్కన నిర్మించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) నూతన కార్యాలయ భవన నిర్మాణం పూర్తయి 10 సంవత్సరాలు గడిచినా అది ప్రారంభానికి నోచుకోవడం లేదు. రూ. 25 లక్షల నిధులతో ఈజీఎస్ కార్యాలయ భవనంతోపాటు మహిళాసమాఖ్య (సెర్ప్) కార్యాలయ భవనం నిర్మాణానికి నవంబర్ 11, 2011వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి డీకే అరుణ శంకుస్థాపన చేశారు. 2012 సంవత్సరంలో నిర్మాణం పూర్తయ్యింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో సమావేశ మందిరంతోపాటు మహిళా సమాఖ్య కార్యాలయం నిర్మించారు. మొదటి అంతస్తులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభించక పోవడంతో ఈజీఎస్ అధికారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈజీఎస్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలోని రెండు చిన్నగదులలో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా మౌలిక వసతులు లేకపోవడంతో అటు అధికారులకు, ఇటు కార్యాలయాల సిబ్బందికి, ప్రజలకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. నూతనంగా నిర్మించిన ఈజీఎస్ కార్యాలయంలో కొంతకాలం మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు వారి కార్యకలాపాలు నిర్వహించారు. ప్రజలనుంచి వ్యతిరేకత రావడంతో వారు పాతబస్టాండ్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలోకి మకాం మార్చారు. ఇప్పుడు ఈజీఎస్ నూతన భవనం ఖాళీగానే ఉంది. అయితే నూతన భవనంలోకూడా మౌలిక వసతులు అంతంత మాత్రమే. విద్యుత్ బోర్డులు సరిగ్గా లేవు, వాష్‌రూంలో వాటర్ ట్యాప్‌లు విరిగిపోయాయి, వాటి నుంచి నీళ్లు వచ్చే అవకాశం లేదు. నాణ్యతలేని తలుపులు ఏర్పాటు చేశారు. నూతన భవనం అసౌకర్యంగా ఉండడంతో ఈజీఎస్ అధికారులు నూతన భవనంలోకి వెళ్లేందుకు అధికారులు ఇష్టపడడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి ఈజీఎస్ నూతన భవనంలో మౌలిక వసతులు కల్పించి భవనాన్ని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మండల పరిషత్ కార్యాలయం భవనంలో సమావేశ మందిరం, ఈజీఎస్ కార్యాలయం ఒకేచోట ఉన్నాయి. రోజురోజుకు ప్రజల తాకిడి పెరిగింది. విడివిడిగా కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. అధికారులతో ఎన్ని సార్లు సమస్యను విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి నూతన ఈజీఎస్ కార్యాలయం భవనాన్ని ప్రారంభించాలి.

– యువతేజేశ్వర్ రెడ్డి, గుడుదొడ్డి

సౌకర్యాలు లేకనే..



ఈజీఎస్ నూతన భవనంలో సౌకర్యాలు లేక ఈజీఎస్ సిబ్బంది నూతన భవనంలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఎంపీడీఓ కార్యాలయంలోనే రెండు ఇరుకైన గదులను వినియోగించుకుంటున్నారు. కంప్యూటర్లు, బ్యాటరీలు, ఈజీఎస్ రికార్డులతో రెండు గదులు నిండిపోయాయి. ఈజీఎస్ పనులకు సంబంధించిన టెంట్లు, గడ్డపారలు తదితర వస్తువులను భద్రపరచడానికి ఇబ్బందిగా ఉంది.

– ఏపీఓ. శరత్ బాబు

ఉన్నతాధికారులకు వివరిస్తాం

మండల పరిషత్ అధికారులు, సిబ్బందితోపాటు ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ఎంపీడీఓ భవనంలోనే పనిచేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అనేక శాఖల అధికారులు, సిబ్బంది సమావేశాలు నిర్వహిస్తారు. ఇరుకైన గదులలో విధులు సక్రమంగా నిర్వర్తించక పోతున్నాం. పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నాం. ఎవరి కార్యాలయాలు వారికి ఏర్పాటు చేయాలి. సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తాం

– సాయిప్రకాష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

చదువులమ్మ చెట్టు నీడలో..



అయిజలో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

గద్వాల: జిల్లా కేంద్రంలోని రవీంద్ర హైస్కూల్‌లో 1982–83లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కొండపల్లి రోడ్డు మార్గంలో ఉన్న ఓ ప్రైవేట్ ఇండస్ట్రీస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 40 వసంతాల తర్వాత కలువడంతో మిత్రమా.. క్షేమమా అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. వృత్తులు, వ్యాపకాలు, కుటుంబ నేపథ్యం, పిల్లల చదువులు, బాగోగుల గురించి పరస్పరం తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు తరగతి గదిలో కలిసిన విద్యార్థులంతా ఒకచోట కలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, డీఈ నవీన్‌కుమార్, జీవన్‌రెడ్డి, రామలింగేశ్వర, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992–93 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 30 సంవత్సరాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. ముందుగా మృతిచెందిన అప్పటి గురువులు లక్ష్మీనారాయణ, వెంకటరాముడు, వీరారెడ్డి, నాగన్న అదేవిధంగా చనిపోయిన పూర్వవిద్యార్థులు శ్రీనివాసులు, సోమన్న, ఇబ్రహీం, వెంకన్న, జయన్న, విజయలక్ష్మి, సయ్యద్ హుస్సేన్‌లకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సీతారామయ్య, నాగన్‌గౌడ్, ఈశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శాంతిభూషన్, బజారన్న, భగీరథరెడ్డి, నారేందర్‌రెడ్డి, చంద్రయ్య, సరళమ్మలకు పూలమాల, శాలువాతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు జయరాముడు, నరసింహులు, సాములు, వీరేష్, రాజ్, హరి, పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో విద్యార్థులు కలుసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత కలువడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి గురువులను సన్మానించారు.



గద్వాలలో



మానవపాడులో ..

ముగిసిన వాసవీమాత స్వర్ణోత్సవం

గద్వాల: వాసవీ కన్యకా పరమేశ్వరీమాత స్వర్ణోత్సవ వేడుకలు మూడో రోజు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో చేపట్టిన విశేష పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సహస్ర కలశాభిషేకం, పంచామృత అభిషేకం, లక్ష పుష్పార్చన తదితర పూజలు చేశారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం చేశారు. పూజలు, హోమాలతో ఆలయంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బిలకంటి రాము, బాలస్వామి, నరహరి శ్రీను, సురేష్, రవి, మధుమతి, వెంకటరమణ, శ్రీకాంత్, వీరబాబు, హనుమంతయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయ మఠం మేనేజర్‌కు ఆత్మీయ వీడ్కోలు

గద్వాల: జిల్లా కేంద్రంలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ సేవలు అందిస్తున్న సంప్రతి మోహన్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు. తొమ్మిది సంవత్సరాలుగా గద్వాల మఠం మేనేజర్‌గా ఆయన విశేష సేవలు అందించి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మఠంలో అష్టోత్తర, భజన మండలి సభ్యులు, శ్రీమఠం శిష్యులు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి సంప్రతి మోహన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు, భీమసేనచారి, రుక్మాంగదరావు, భీంసేన్ రావు, వెంకోభారావు, గిరిరావు, శ్రీకాంత్, రామాచారి, అజిత్‌కుమార్, ప్రకాష్‌రావు, మధుసూదన్ రావు, ప్రదీప్‌కుమార్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

గ్యాంగ్‌స్టర్ విడుదలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: ఐఏఎస్ అధికారిని చంపిన గ్యాంగ్‌స్టర్ విడుదలపై బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉండవెల్లి మండలం బైరాపురం గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణయ్యను హత్య చేసిన గ్యాంగ్‌స్టర్‌ను బీహార్ ప్రభుత్వం విడదల చేయడాన్ని నిరసిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ ఆఫీసర్‌ను కాల్చి చంపిన గ్యాంగ్‌స్టర్ ఆనంద్ మోహన్‌ను బీహార్ ప్రభుత్వం జీవిత ఖైదు నుంచి విముక్తి కలిగించి విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ రాష్ట్రంలో గోపాల్ గంజ్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో గ్యాంగ్‌స్టర్ రాజకీయ నాయకుడు ఆనంద్‌మోహన్ మూకదాడుల్లో మరణించారని గుర్తు చేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం బీహార్ ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కనకం బాబు, సురేష్, విజయ్ కుమార్, దయాకర్, వసంత్, నాగేంద్ర, ప్రవీణ్, చిరంజీవి, బాబు, శ్రీకాంత్, సునీల్, సాగర్, బుచ్చన్న, రమేష్, జావేద్ బాష, నాగరాజు తదితరులు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తం

గద్వాల క్రైం: సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్‌ఐ రామస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలో కృష్ణాగ్రహారం కాలనీలో పోలీసు కళాజాతా బృందం పలు సామాజిక అంశాలపై ప్రజలకు పాటల ద్వారా చైతన్యం చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులపై అసభ్యకరంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై స్పందించవద్దన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. అత్యవసర సమయల్లో డయల్ 100కు కాల్ చేసి వారి సమస్యలపై ఫిర్యాదులు చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు కళాజాతా బృందం, షీ టీం సభ్యులు తదితరులు ఉన్నారు.

సహకారం లేకనే ఎమ్మెల్యేకు దూరం



శాంతినగర్: అభివృద్ధిపై ఎమ్మెల్యే అబ్రహం సహకారం లేకనే ఆయనకు దూరంగా ఉన్నట్లు వడ్డేపల్లి వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే తీరు నచ్చక మార్చి 21న తనగలలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకాలేదని పేర్కొన్నారు. వడ్డేపల్లి ఎంపీపీ రజిత, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎంపీటీసీ బీఫారం ఎమ్మెల్యే ద్వారా రాలేదని గెలుపుగుర్రాలను గుర్తించి అధిష్టానం, జిల్లా, మండల పార్టీ అధ్యక్షులు ఇస్తారని, ఎవరివల్ల రాలేదన్నారు. రామాపురం ఎంపీటీసీ–2 స్థానాన్ని ఇండిపెండెంట్‌గా గెలిపించుకున్నామని గుర్తుచేశారు. సమావేశంలో కౌన్సిలర్ అజయ్‌కుమార్, సర్పంచ్ రాజ్, ఎంపీటీసీ పద్మ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్రామన్‌గౌడ్, నాయకులు మాదన్న, వెంకటేష్, పాలన్న పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల తోడ్పాటు

మానవపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రవికుమార్, డాక్టర్ కె.రాణి పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి రవికుమార్ ఇస్రోలో 4 సంవత్సరాలు పని చేశారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఇద్దరికి అందిస్తానని తెలిపారు. అదేవిధంగా ఇటిక్యాల మండలం మునగాల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి డాక్టర్ కె. రాణి ప్రస్తుతం ఉస్మానియా ఆరోగ్య కేంద్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులకు రూ.50వేలు అందజేశారు. 1992–93 సంవత్సరం బ్యాచ్ తరఫున పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ సర్పంచ్ మార్తమ్మ(75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ మరియమ్మ పేర్కొన్నారు. సర్పంచ్ మృతి తీరనిలోటన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న జేఏసీ నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆదివారం కాంట్రాక్ట్ ఉద్యోగులను సచివాలయం ప్రారంభోత్సవంలో భాగంగా సీఎం కేసీఆర్ క్రమబద్ధీకరిస్తూ ఫైలుపై సంతకం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు పవన్ కుమార్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగాలు కొనసాగిన ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేయడం హర్షనీయమన్నారు. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజు, నర్సింహులు, కలీముల్లా, రామాంజనేయులు, గీత, శ్రీదేవి, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



గద్వాలలో హరితహారం టోపీలు, కండువాలు ధరించి నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు



అయిజలో సమ్మెలో పాల్గొన్న జేపీఎస్, ఓపీఎస్

గద్వాల అర్బన్: సమస్యలు పరిష్కరించాలంటూ జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆదివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. హరితహారంలో కీలకపాత్ర పోషించిన కార్యదర్శులు హరితహారం టోపీలు, కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు నడిగడ్డ సోషల్ ఫోరమ్ జనరల్ సెక్రటరీ ప్రతాప్, మండల పంచాయతీ అధికారుల సంఘం చెన్నయ్యలు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జేపీఎస్‌ల అధ్యక్షుడు రాధాగోపాల్, జనరల్ సెక్రటరీ పాండు, భరత్ నాయుడు, ప్రవీణ్, పరమేష్ ఉన్నారు.

అయిజ: గ్రామ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజు ఆదివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగింది. బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు కార్యదర్శులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జేపీఎస్, ఓపీఎస్‌లను మూడు సంవత్సరాల ప్రవేశం పీరియడ్ తర్వాత రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఒక సంవత్సరం పెంచి నాలుగు సంవత్సరాలుగా కార్యదర్శులతో వెట్టి చాకిరి చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్యదర్శులు డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు సాధిద్దాం



నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: మహనీయుల ఆశయాలను సాధిద్దాం బీఎంసీఈఎఫ్ నాయకుడు ఇమ్మానియేల్ అన్నారు. వెనుకబడిన, మైనారిటీ వర్గాల ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు ర్యాలీని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి రాజీవ్‌మార్గ్, పాతబస్టాండు, కృష్ణవేణి చౌరస్తా, అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో బాబు జగ్జీవన్ రామ్, మహాత్మాజ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జన్మించారని గుర్తు చేశారు. మహనీయుల కృషితోనే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, జీవనం విధానం, కనీస హక్కులు పొందుతున్నామన్నారు. ర్యాలీలో హనుమంతు, ప్రవీణ్ కుమార్, శేఖర్ బాబు, బహుజన రాజ్య సమితి వాల్మీకి, వివిధ సంఘాల నాయకులు కృష్ణయ్య, లక్ష్మణ్, అశోక్, సుహాస్, వినోద్, చంద్రకాంత్, రమేష్, మోహన్, విద్యావతి, దానయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం, ఆర్. గార్లపాడు గ్రామాల్లో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదండాపురంలో తిమ్మమ్మవ్వ, ఆర్. గార్లపాడులో శివాంజనేయ స్వామి ఆలయాల ఎదుట మూడు రోజుల పాటు అర్చకులు వేద మంత్రాల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ హక్కు చట్టం అవసరం

గద్వాల అర్బన్: యువత భవిష్యత్తు, ప్రభుత్వానికి జవాబుదారీ కోసం ఉద్యోగ హక్కు చట్టం అవసరమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాషా ఆధ్వర్యంలో ఉద్యోగ హక్కు– రాజ్యాంగబద్ధం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ యువతకు ఉద్యోగ హక్కు చట్టం చేసి, రాజ్యాంగ బద్ధ రక్షణ కల్పించే విధంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సంఘాలన్నింటిని భాగస్వాములు చేస్తూ సంఘటిత ఉద్యమాలు చేయాలని తీర్మానించారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కో కన్వీనర్ హనుమంతు, అబ్దుల్ బాబు, ప్రభాకర్, అంజనేయులు, మోసేస్, మధుసూదన్ బాబు, దౌలత్, మోహన్, ఉన్నారు.

వాసవీక్లబ్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసులు



అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

శాంతినగర్: వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ పట్టణ అధ్యక్షుడిగా స్థానిక సప్తగిరి మెడికల్ షాప్ యజమాని శ్రీనివాసులును ఆ సంఘం నాయకులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో వాసవీక్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. సెక్రెటరీగా రాముడు, ట్రెజరర్‌గా బాదం సత్యం, కార్యవర్గ సభ్యులుగా మద్దెలబండ శ్రీను, హోటల్‌విజయ్, మురళీమోహన్, రాజప్రవీణ్, రామయ్య, లక్ష్మీనారాయణ, రాజోళి రాజశేఖర్, మధుసూదనశెట్టిని ఎన్నుకుని ప్రమాణస్వీకారం చేయించారు. వాసవీకన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ రీజినల్ చైర్మన్ కర్నూలుకు చెందిన జయంతి వెంకటేశ్వర్లు, గవర్నర్ చంద్రశేఖర్, వెంకటపద్మజ, రాఘవేంద్ర, హిమబిందు, ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ ప్రసంగం

గట్టు: దేశ వ్యాప్తంగా 4 లక్షల కేంద్రాలు 100వ మన్ కీ బాత్ ప్రసారమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 100వ మన్ కీ బాత్ కార్యకర్తలతో కలిసి తిలకించారు. కొలయి భాస్కర్, రాజప్ప, రమేష్, నాగయ్య, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: విజయదశమి రోజు ప్రారంభమైన మన్ కీ బాత్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. ఆదివారం మండలంలోని సింధనూరులో నిర్వహించిన 100వ మన్ కీ బాత్ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని విన్నారు. మండల అధ్యక్షుడు శేఖర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రమేష్, రాష్ట్ర, మండల బూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 100వ మన్–కీ బాత్‌ను మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ నందిన్నె ప్రకాష్ రావు ఆధ్వర్యంలో తిలకించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వేములలో ఆదివారం మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని గ్రామస్తులు శ్రద్ధగా విన్నారు.